# "అసలు రహస్యం"

రచయిత: సింగరాజు రామచంద్రమూర్తి

"సినిమాకి వస్తావా శ్రీమతీ?" అడిగాడు గోపాలరావు వంటింట్లోకి వెళ్ళబోతున్న రాధని.

ఒక్కసారి వెనక్కి తిరిగింది జడ ముందుకి పడేట్టు రాధ "నాకు వేరే పనిలేదనుకున్నారా ఏమిటి?" అంది సీరియస్‌గా.

"అని నేనన్నానా? పనిలేదనే వచ్చావా ఇదివరలో?"

"ఇంట్లో పనంతా పాడుపెట్టి మీ వెంట షికార్లు తిరిగే దాన్ని సరా!" అంది ముఖం ముడుచుకుని.

గోపాలరావుకి హుషారు ఇంకొంచెం ఎక్కువయింది.

"పోనీ మీ చెల్లెలొస్తుందేమో అడుగు. ఎంత కాకపోయిన నీ తరువాత నీ అంతది" అన్నాడు నవ్వుతూ.

"మధ్య నేనెందుకూ అడగటం? మీరే అడగండి, వస్తే తీసుకువెళ్ళండి. నాకు నిజంగా అభ్యంతరంలేదు" నిజమే మాట్లాడుతున్నా నన్నట్లు నవ్వింది.

"ఏం శైలజా, నువ్వు రారాదూ సినిమాకి వెడదాం."

"బాగానేవుంది అక్కయ్య రాకుండా నేనా! అదివస్తే వెడదాం" అంది రాధవంకచూస్తు శైలజ.

"నాతో బింతెందుకే! నిజం చెప్తున్నాను బావతో వెళ్ళు. నివ్వొచ్చాక అసలు సినిమాకి తీసికెళ్ళలేదు. దేనికి తీసుకువెడతారు శైలజని?"

"ఇంగ్లీషు సినిమా సినిమాస్కోపు" అన్నాడు బూటు వేసుకుంటూ.

"అయితే నేను రానుబాబూ! ఇంకా తెలుగుదేమో అనుకున్నా."

"పోనీ తెలుగు సినిమాకి వెళ్ళరాదుటండీ. అదీ వస్తుంది."

"అదంతా నాకు తెలియదమ్మాయి. నువ్వయినా, నీ చెల్లెలయినా లేకపోతే ఇద్దరు అయినా సరేరండి ఇంగ్లీషు సినిమా చూపిస్తాను. కాదంటారు హాయిగా ఒక్కడ్నే వెడతాను. పైగా సెకండు షో కూడా నిద్దరొస్తుంది మీకు."

"ఏమే శైలజా వెడతావే?"

"ఊహుఁ"

"ఆల్‌రైట్ నే వెడతాను. బయట తాళంవేసుకుని వెడతాను. మళ్లీ మిమ్మల్ని నిద్రలో డిస్టర్బ్‌చేయటం దేనికి?



"బయటికి వెళ్ళలేరండి" కోపంగా అంది రాధ.

"స్టుపిడ్ గర్ల్! ఇదివర కెన్నిసార్లలా చేశాను. ఒకరి మీద అనుమానం కొద్దీని! మీరే నిద్దట్లో ఇబ్బంది పడతారని."

"మీ ఇష్టం బాబూ! తాళం అక్కడ డ్రాయరుమీద వుంది. పదశైలూ, మనం పడుకుందాం" అంది రాధ.

తాళం తీసుకుని బయటికి నడిచాడు గోపాలరావు.



అర్థ నగ్నంగా వున్న ఆ బొమ్మలని చూస్తుంటే గోపాలరావుకి రక్తపుపోటు ఎక్కువయిపోతోంది. కథ మట్టుకు సాగిపోతూనేవుంది. కాని కథని అర్థంచేసుకునే స్థితిలో లేదు. హీరోయిన్ని చీకటిరోడ్లమ్మట ఎవరో వెంబడిస్తున్నారు. బట్టలున్నాయా ఊడాయా అన్న సంశయమయినా లేకుండా పరుగెత్తోంది. ఇంతలో హటాత్తుగా హీరో ఎదురయి అమాంతంగా ఆమెను కౌగలించుకున్నాడు. హీరోయిన్కి ఊపిరాడనంత బలంగా, రక్తం పిండుతున్నట్టుగా అనిపించింది గోపాలరావుకి. ఆ రకంగా ఘుమారుగా రెండు మూడు నిముషాలు బల్లుల్లాగా అతుక్కునే వున్నారు నాయకీ నాయకులు ... ... గోపాలరావుకి కణతలు అదుర్తున్నాయి. కుర్చీతాలూకు చేతిని గట్టిగా నొక్కిపట్టాడు. ఇంకో సీనులో బాతింగ్ డ్రస్సులో వుంది హీరోయిన్. ఎక్కడినుంచీ ఊడిపడ్డాడో విలన్ అమాంతంగా ఆమెని కౌగలించుకొని కిందపడేశాడు.

"ఇంకా నయం శైలజని తీసుకువస్తే పరువు దక్కనిచ్చే వాణ్ణి కాదు. పెళ్ళయిన పిల్లకూడా! అనుకున్నాడు గోపాలం.

సినిమా అయిపోయింది. తాగిన వాడిలా బయటపడ్డాడు. రిక్షాఎక్కి ఇంటిముందు దిగాడు. అతని ఒకే ఒక ఆలోచన భార్యమీద వుంది. రిక్షావాడికి డబ్బులిచ్చేసి తలుపు తాళంతీశాడు చప్పుడు చేయకుండా. మళ్ళ లోపలి గడియవేసి నిలబడ్డాడు. చీకటికి అలవాటు పడేందుకు. లైటువేస్తే శైలజకూడా లేవచ్చునని భయం.

గబగబ మేడపైకి వెళ్ళాడు. అంతా నిశ్శబ్దంగావుంది. వెతుక్కుంటూ గదిలోకి వెళ్ళాడు. అంత చీకటిగా వుంది. మంచాన్ని సమీపించేప్పటికి అతని ఆనందానికి అంతులేదు.

"రాధ ఒక్కతే పడుకునివుంది. రక్షించింది" అనుకుంటూ వెనకనించిఆమెను దగ్గరకులాక్కుని తనవైపు తిప్పుకున్నాడు. అంత చీకటిలోకూడా ఆమె కళ్ళు మిలమిలలాడాయి.

"నేను, నేను" అంటూ ఇంకా ఏమోఅనబోయింది.

"నేనులేదు నువ్వూలేదు. ఇది హాలీవుడ్ సినిమా మహిమ" అంటూ ఆమెనోటిని నోటితో బలంగా మూశాడు.

తెల్లవారకట్ట మెలకువవచ్చిన గోపాలరావు పక్కన చూసుకున్నాడు. ఖాళీగావుంది. నలిగిన మల్లెపూలుచెండు మట్టుకు కనబడింది. చిన్నగా నవ్వుకుని బద్ధకంగా ఆవలించిలేచి కూర్చున్నాడు.

"ఇంకా లేవరేం, అవతల కాఫీకలిపి శైలజ మీకోసం కూర్చుంది. మనిషిమనిషికీ ఇవ్వాలికాబోలు పిలిచి. హొటలనుకున్నారా, ఇల్లనుకున్నారా, సాధిస్తోంది రాధ.

వెంటనే లేచి కిందకెళ్ళాడు. మూలగా కూర్చునివుంది రాధ.

"అక్కడున్నావేం?" అన్నాడు ఆశ్చర్యంగా.

"శలవుపెట్టాగా. శైలజ్నవంట" అంది నవ్వుతూ రాధ.

"ఎప్పుడు?"

"రాత్రి మీరు సినిమాకి వెళ్ళినవెంటనే అయాను."

గోపాలరావుకి తల తిరిగిపోయింది. "మరి రాత్రివిషయం?" ఆశ్చర్యపోయాడు. నోరు తెరిస్తే పసికట్టుందని మాట్లాడకుండా దొడ్లోకి వెళ్ళిపోయాడు.

పంపుదగ్గర నీళ్ళు పట్టుంటోంది శైలజ.

"మీ అక్కయ్య వాకిటుందిటగా" అన్నాడు కళ్ళలోకి సూటిగా చూస్తు.

శైలజ బుగ్గలు సిగ్గులో ఎర్రపడ్డాయి "అవును" అంది తలవంచుకుని.

"మరి రాత్రి......నువ్వు ఎక్కడ పడుకున్నావ్?

శైలజ ఇంకా సిగ్గుపడింది వంచినతల మరీవంచింది.

గోపాలరావుకి అర్థమయిపోయింది. "అయితే నువ్వే నన్నమాట రాత్రి..." అంటుండగానే మధ్యలోనే అందుకుంది శైలజ "అక్కయ్య వింటుంది" నోరు మూస్తు.

"చాలా అదృష్టవంతుడ్ని ... ఈరోజు కూడా పొరపాటున నా గదిలో పడుకుంటావా?" అని వీపుమీద తట్టి ఈలేసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ మూడు రోజులూ గోపాలరావు, శైలజకి మూడు నిమిషాల్లా గడిచిపోయాయి.

రాధ ఇంట్లోకివచ్చింది. గోపాలరావుకి దిగులు పట్టుకుంది. ఇక నాటకంసాగదు శైలజతో అని "ఏంచేద్దాం" అన్నట్టు చూచాడు నిజానికి ఈ విషయం బాధగానే వుంది.

"ఒకపని చేద్దాం. రాత్రి సరిగాపదకొండు గంటలకి కింద బాత్‌రూమ్‌లోకిరా. నేను మళ్ళ సెకండ్‌షోకి వెళ్ళినట్టు వెళ్ళి అక్కడికి వస్తాను. సరేనా!" అన్నాడు.

తల ఊపింది శైలజ.

గోపాలరావుకి మళ్ళీ హుషారొచ్చింది ఆఫీసునుంచి రాంగానే భోజనంచేసి కాసేపు రాధతో కబుర్లు చెపుతూ కూర్చున్నాడు. ఇంతలో తొమ్మిదయింది.

"సెకండ్‌షోకి వెడుతున్నాను రాధా" అన్నాడు లేచి నిలబడి.

"దాన్నికూడా తీసుకుపొండి ఇంగ్లీషుసినిమా అయితే ఏం చూస్తుంది. ఏం శైలజా వెడతావా?" అనడిగింది రాధ.

ఒక్కసారి రాధవంక చూశాడు. గోపాలరావు అనుమానిస్తుందేమోనని. అక్కడ అటువంటి లక్షణాలు కనపడకపోగా ఆమె కళ్ళు ఆనందంలో మెరుస్తున్నాయి. శైలజానికూడా తీసుకపోదాము అని ఆలోచించాడు కాని బావుండదు. మరీ తెగించి నట్టుంటుందనిపించింది. దానికి తగ్గట్టుగానే శైలజకూడా "రానులే బావా ... ఒంటి గంటవుతుంది" అంది.

"ఒంటి గంటేం కర్మ తెల్లగా రెండవుతుంది" అన్నాడు నవ్వుతూ.

"సరే వెడతాను" అని లేచి యథాప్రకారం తాళం బయటవేసుకుని వెళ్ళిపోయాడు.

నేరుగా సినిమాహాలుకి పోయి టిక్కట్టు కొని లోపల కూర్చున్నాడు. కాని ధ్యాసంతా గడియారంమీదే వుంది. ఇంటర్వెలవంగానే ఇంటిదారి పట్టాడు. పదిన్నరయింది. ఇంటికి చేరేప్పటికి ఇంకో పావుగంటయింది.

బయటిగేటు తీసుకుని దొడ్డిదారిన బాత్‌రూమ్ దగ్గరకు వెళ్ళాడు. అంత కటికచీకటి. కన్నుపొడుచుకున్నా పక్కలేమున్నదో కనపడ్డంలేదు. గదితలుపు తీసి లోపలకి అడుగుబెట్టాడు.

అతనిచుట్టు రెండు నాజూకయిన చేతులు పెనవేసుకున్నాయి. మృదువయిన శరీరం అతనిదగ్గరగా వచ్చింది. సువాసనలు విరజిమ్మే ముఖం అతనిగుండెలమీద వాలింది.

శైలజ అనుకున్నాడు గోపాలరావు. గట్టిగా దగ్గరకు తీసుకున్నాడు.

"నీకోసం అర గంటనుంచి ఎదురు చూస్తున్నాను భాస్కరం. ఆయనేమో సినిమాకి వెళ్ళారు. రెండు గంటల దాకారారు. మా శైలజ గుర్రుపెట్టి నిద్రపోతోంది...నువ్వు నేను కలుసుకుని మూడు రోజులే అయినా మూడు యుగాలుగా వుంది. ఇకనుంచి మనకు భయంలేదు! మా ఆయన మనస్సు శైలజమీదికి పోయేట్టు చేశాను! దాంతో ఆయన తప్పులుపడుతున్నారు. పైగా నాకు తెలియదని వాళ్ళుద్దేశం! అసలు దాన్ని ఆయన గదిలో పడుకోమందే నేను. ఇదంతా ఎవరికోసం? నీ కోసం" అంటూ గుండెలమీద తలతో ముక్కుతో రాస్తూ చెప్పుకుపోతోంది రాధ. గోపాలాన్ని చూసి భాస్కరం అనుకున్న రాధ!

గోపాలం కాలికింద భూమి కుంగిపోతున్నట్టు బాధపడ్డాడు. తలలో వేయి అణుబాంబులు పగుల్తున్నాయి. ఆమెని ఒక్కసారి వదిలించుకుని బయటపడ్డాడు. ఆ సమయానికి శైలజ తలుపుతీసుకుని చప్పుడుచేయకుండా రావడం కనబడిందతనికి. ఎవరికోసం? తనకోసం! ★

